క్లుప్తంగా

ఆశ వర్కర్ల ముందస్తు అరెస్టు



పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆశవర్కర్లు

హుజూరాబాద్: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు 16 రోజులుగా సమ్మె చేస్తున్నారు. సోమవారం సమ్మెకు మద్దతుగా చలో హైదరాబాద్‌కు వెళ్తున్న 31 మంది ఆశా వర్కర్లను హుజూరాబాద్ పోలీసులు సోమవారం తెల్లవారుజామున ముందస్తుగా హౌజ్ అరెస్టు చేశారు. ఆశవర్కర్ల సంఘం నాయకులు తాడురి లత, పుష్పా రాణి మాట్లాడుతూ... వేతనాలు పెంచాలని, ఆర్థిక ఇబ్బందుల మధ్య విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొందని, ప్రభుత్వ యంత్రాంగం స్పందించి న్యాయం చేయాలని కోరారు. పోలీసుల అదుపులో ఆశవర్కర్లు మధీన, సుజాత, శారద, సరోజన, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాంకు నివాళి



కాన్షీరాంకు నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌక్, సిర్సపల్లి క్రాస్ రోడ్డు వద్ద సోమవారం బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు, స్వర్గీయ మాన్యవీర్ కాన్షీరాం వర్ధంతిని నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డ సమ్మయ్య, మేకల రవీందర్, దొడ్డ శ్రీనివాస్, వాసాల రామస్వామి, మిడిదొడ్డి స్వప్న, రాచపల్లి రఘుపతి, నీతుల కుమారి యాదవ్, కూరపాటి రామచంద్రం, పల్లె ప్రశాంత్ గౌడ్, కండె తిరుపతి, రామ్ శ్రీనివాస్, రాచపల్లి రమేష్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్నపోలీసులు

ఇల్లందకుంట: రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సిరిసేడు గ్రామశివారులోని ప్రధాన రహదారిపై ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ కిషోర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో తనిఖీ చేశామని ఏసీపీ తెలిపారు.మద్యం, నగదు తరలిస్తే సంబంధిత అనుమతి పత్రాలు చూపించాల్సి ఉంటుందని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైరాజకుమార్, కానిస్టేబుళ్లు అనిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ బాక్స్ అందజేత



తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ మానసిక వికలాంగుల పాఠశాలలో లయన్స్, చైతన్య క్లబ్ ఆధ్వర్యంలో పిల్లలకు సుమారు రూ.20 వేల విలువగల సౌండ్ బాక్సులు అందజేశారని ప్రిన్సిపల్ రోజా దేవి తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు రమణారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి , అశోక్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కమాకర్ రెడ్డి, సురేందర్, పాఠశాల సిబ్బంది బాలరాజు తదితరులు పాల్గొన్నారు

అనర్హులను తొలగించాలి



ఇల్లందకుంట: గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపికలో అనర్హులను తొలగించాలని మల్యాల గ్రామస్తులు సోమవారం గ్రామ పంచాయతీ వద్ద ఆందోళన చేపట్టారు. నాయకులు ఇష్టానుసారం అనర్హులకు చోటుకల్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన నిరుపేదలకు పథకంలో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. భూమి ఉండి ఇల్లు కట్టుకునే స్థోమత లేని వారిని గుర్తించి అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మరమ్మతు మరిచారు

- తెగిన రోడ్డును పట్టించుకోని పాలకులు, అధికారులు
- గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- బడికెళ్లడానికి విద్యార్థుల అవస్థలు



గర్రెపల్లి- సైదాపూర్ గ్రామాల మధ్య ధ్వంసమైన కల్వర్టు

సైదాపూర్: ప్రభుత్వం, పాలకుల నిరాదరణతో మట్టిరోడ్లు మరమ్మతుకు నోచుకోవడం లేదు. దీంతో ఏటా వర్షాకాలంలో మట్టిరోడ్లు తెగిపోతుండటంతో ఆయా గ్రామాలకు సంబంధం తెగిపోతుంది. ప్రజలు రాకపోకలకు నరకం అనుభవిస్తున్నారు. తెగిన రోడ్లతో ప్రాణాలు పోయినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని సోమారం గ్రామ పంచాయతీ పరిధిలోని గర్రెపల్లి నుంచి సైదాపూర్ మట్టిరోడ్డు పొల్కమ్మ చెరువు వాగుపై కల్వర్టు జూలైలో కురిసిన భారీ వర్షాలకు తెగిపోయింది. దీంతో గర్రెపల్లి నుంచి మండల కేంద్రం సైదాపూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. గర్రెపల్లి గ్రామస్తులకు విద్య, వైద్యంతో పాటు ప్రతి పనికి, నిత్యావసరాలకు మండల కేంద్రంకు వెళ్లాల్సిందే. అలాంటి రోడ్డుకు నెలలు గడిచినా కనీస మరమ్మతులు చేయకపోవడంతో బడికి వెళ్లాల్సిన చిన్నారులు గర్రెపల్లి నుంచి సోమారం నుంచి సైదాపూర్‌కు ఉదయం, సాయంత్రం రోజూ 14 కిలోమీటర్లు నడిస్తేనే బడి భాగ్యం కలుగుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పనికి రోజుకు పదిసార్లు పోతేనే పొద్దు గడుస్తుందని, గ్రామ పంచాయతీ పాలకులు, అధికారులు గర్రెపల్లితో సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. కనీస మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. బంగారు తెలంగాణలో దశాబ్ద కాలంలో గర్రెపల్లికి తట్టెడు మట్టిపోయలేదని, పాలకుల నిర్లక్ష్యానికి గ్రామానికి కనీస మౌలిక వసతులు కరువయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగిన రోడ్యాంకు మరమ్మతు చేసి ద్విచక్ర వాహనాలు వెళ్లేలా రోడ్డు బాగు చేయాలని, ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించాలని కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



రోడ్డు కల్వర్టు తెగిపోయి మూడు నెలలైనా పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. తట్టెడు మట్టిపోసి గండ్లు పూడ్చడం లేదు. గత ఐదేండ్లు గర్రెపల్లిలో వసూలు చేసిన పన్నులతో పల్లెలో పైసా ఖర్చు చేయరా? దశాబ్ద కాలంగా గర్రెపల్లి వివక్షకు గురవుతోంది. పంచాయతీలో గర్రెపల్లి లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని మిగతా గ్రామాల్లో వర్షాలు కురువలేదా? అక్కడ ఇలాంటి సమస్యలున్నా పాలకులు పరిష్కరించలేదా? ఇప్పటికైనా మరమ్మతు చేయించాలి.

– వేముల కొమురయ్య, మాజీ వార్డు సభ్యుడు, గర్రెపల్లి

నేడు డయల్ యువర్ డీఎం

హుజూరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయ ఆవరణలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నామని డిపో మేనేజర్ పి.అర్పిత తెలిపారు. సలహాలు సూచనలు అందించేందుకు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో 9959225924 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి

హుజూరాబాద్: వివిధ వర్గాల కోసం తపాలా శాఖ ప్రవేశపెట్టిన పథకాలను, సేవలను వినియోగించుకోవాలని తపాలా శాఖ సబ్ డివిజన్ ఏఎస్పీ మోహన్ కోరారు. సోమవారం పట్టణంలోని తపాలా కార్యాలయంలో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా కేంద్రం పొదుపు, బీమా, పింఛన్ తదితర పథకాలను రూపొందించిందన్నారు. సమీపంలోని పోస్టాఫీసుల్లో పథకాలతో ప్రజలు ప్రయోజనం పొందాలన్నారు. పోస్టల్ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. పొదుపు, పింఛన్, బీమా, పార్సిల్, ఆధార్ నమోదు, సవరణ, రైల్వే రిజర్వేషన్ తదితర సదుపాయాలున్నాయన్నారు.

డీటీఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



జమ్మికుంట: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



ఇల్లందకుంటలో...



చిగురుమామిడిలో..

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు ఎ. నరహరి ఆధ్వర్యంలో డీటీఎఫ్ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక మహాసభల పోస్టర్ సోమవారం ఆవిష్కరించారు. డీటీఎఫ్ ఏర్పడి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా మహబూబ్‌నగర్‌లో ఈ నెల 15, 16, 17వ తేదీల్లో మహాసభలు నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు, సమాజ హితం కోరేవారు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హెచ్‌ఎం సమ్మయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజిరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

చిగురుమామిడి: డీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజమౌళి కోరారు. మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనం ఎదుట ఉపాధ్యాయులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా, వైద్య రంగాలకు తక్కువ నిధులు కేటాయిస్తూ సామాన్యులకు ఉచిత విద్య, వైద్యానికి దూరం చేస్తున్నాయన్నారు. మహాసభల్లో తొమ్మిది ముఖ్యమైన అంశాలపై చర్చించనున్నామని తెలిపారు. డీటీఎఫ్ మండల అధ్యక్షుడు గుర్రం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోల రాంచంద్రారెడ్డి, ఆర్ రాజయ్య, లింగారెడ్డి, విజయలక్ష్మి, శోభారాణి, పలువురు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: డీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి అన్నారు. ఇల్లందకుంట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో సభల పోస్టర్ ఆవిష్కరించారు. ఆడిట్ కమిటీ సభ్యులు సంపత్, మండల అధ్యక్షుడు సీహెచ్.వేణు, ప్రధానోపాధ్యాయులు జి.సాంబయ్య, సమ్మిరెడ్డి, వెంకట్రాజం, టీచర్లు సత్యనారాయణ, శంకర్, మారుతి, ప్రసాద్, నాగరాజు, మల్లయ్య, రాజు, అఫ్జల్, శ్రీదేవి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రామడుగు: బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కలిగేటి కవిత

హుజూరాబాద్‌రూరల్: ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జూపాక గ్రామంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ చీరలను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగ్గిల అంకుష్, ఎంపీటీసీ కంకణాల వేణుగోపాల్ రెడ్డి, రేషన్ డీలర్ రూపిరెడ్డి నిరంజన్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు తోట, తాళ్లపెల్లి వెంకటేష్, తాళ్లపెల్లి రాజమౌళి, పంజాల క్రాంతి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గోలిరామయ్యపల్లి, మోతె గ్రామాల్లో సోమవారం ఎంపీపీ కలిగేటి కవిత బతకమ్మ చీరలు పంపిణీ చేశారు. అలాగే గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉప్పుల అంజనీప్రసాద్, ఉపసర్పంచ్ కనకయ్య, సింగిల్ విండో డైరెక్టర్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధునయ్య, పలువురు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'ప్రొసీడింగ్‌లు పంపిణీ



ప్రొసీడింగ్‌లు అందిస్తున్న ఎంపీపీ కొత్త వినీతారెడ్డి

చిగురుమామిడి: పేదల సొంతింటి నిర్మాణానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద రూ. మూడు లక్షలు అందిస్తోందని ఎంపీపీ కొత్త వినీతారెడ్డి అన్నారు. సోమవారం చిగురుమామిడి రైతు వేదికలో లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లు పంపిణీ చేశారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. ఎంపీడీఓ నర్సయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లేశం, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు కొంరయ్య, తదితరులు పాల్గొన్నారు.



శంకరపట్నంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

శంకరపట్నం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అంజేశారు. ఎంపీపీ సరోజన, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీఓ బషీరొద్దీన్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నియామకం



హుజూరాబాద్:
హుజూరాబాద్ నగర పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాటిపాముల రామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కొలిపాక సారయ్య ఎన్నికయ్యారు.

టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా అంబాల ప్రభాకర్



జమ్మికుంట: టీజీపీఏ(తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్) వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కూరు యాదయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏడు సంవత్సరాలుగా ఎస్సీ ఎస్టీ, మైనార్టీ, జనరల్ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రతి సమస్యను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. రాబోయే రోజుల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైన పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీజీపీఏ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి గ్రామంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ రేకుర్తి కంటి వైద్యశాల చైర్మన్ కొండ వేణుమూర్తి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందికి పరీక్షలు నిర్వహించారు. 15 మందిని ఆపరేషన్ కోసం ఆసుపత్రికి పంపించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చిదుర సురేష్, ప్రోగ్రాం చైర్మన్ ఉపసర్పంచ్ ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్ క్లబ్ చొప్పదండి శాఖ అధ్యక్షుడు మహేశుని మల్లేశం, కార్యదర్శి దూస రాము, రాజేష్ పవార్, ఎంపీటీసీ కట్టికోల తార, గన్ను శ్రీనివాస్‌రెడ్డి, గ్యాజంగి రాములు పలువురు పాల్గొన్నారు.

అరుంధతి కల్యాణ మండపం ప్రారంభం



కల్యాణ మండపం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: పేదింటి ఆడపిల్లల పెళ్లికి ఇబ్బందులు కలగకుండా అందుబాటులో అరుంధతి కల్యాణ మండపం నిర్మించామని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని మహాత్మానగర్‌లో రూ.1.50 కోట్లతో నిర్మించిన అరుంధతి కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పాలన సాగిందన్నారు. 60 ఏళ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదేళ్లలో జరిగిందని, పల్లెలు పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందాయన్నారు. అన్నికులాలు, మతాల వారికి సంక్షేమ ఫలాలు అందాయని, వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, సర్పంచులు జక్కని శ్రీవాణి, మీసాల అంజయ్య, ఉప్పులేటి ఉమారాణి, వడ్లూరి శంకర్, బోయిని కొమురయ్య, మేడి అంజయ్య, ఎంపీటీసీ పద్మ నాయకులు సారయ్య, జలపతి, ఆంజనేయులు, సంపత్, రమేష్ సతీష్, వెంకట్‌రెడ్డి దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌ను పీవీ జిల్లాగా ఏర్పాటు చేయాలి

సైదాపూర్: హుజూరాబాద్‌ను పీవీ జిల్లాగా ఏర్పాటు చేయాలని మండలంలోని అఖిల పక్షం నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు పుట్టిన గడ్డ హుజూరాబాద్‌ను ప్రాంత ప్రజలకు పరిపాలనా సౌలభ్యం కోసం పీవీ పేరున జిల్లాగా ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించే ర్యాలీకి అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వీరేశం, వెన్కెపల్లి ఎంపీటీసీ సంతోష్, కూతురు విద్యాన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నమిండ్ల రవీందర్, రిటైర్డ్ ఉద్యోగులు కొత్త ప్రభాకర్‌రెడ్డి, కొత్త సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు దొంత చంద్రయ్య, యాదగిరి, వెంకట్రాజం, సందీప్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చొప్పదండి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించాలని చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ మేడిపల్లి సత్యం కోరారు. సోమవారం మండలంలోని ఆర్నకొండ గ్రామానికి చెందిన మహిళలు, ఇతర పార్టీల కార్యకర్తలు మోదుంపల్లి కృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కండువాలు కప్పి మేడిపల్లి సత్యం కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతిగౌడ్, బుచ్చయ్య, కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్య, ఎల్లాల ఆదిరెడ్డి, సోమిడి శ్రీనివాస్, గంగారాం, సంతోష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో గడపగడపకూ కాంగ్రెస్ నిర్వహించారు. కార్యక్రమానికి మేడిపల్లి సత్యం హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలుచేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్యప్రసన్న, నాయకులు బి. తిరుపతి, రమేష్, జవ్వాజీ హరీష్, పులి ఆంజనేయులుగౌడ్, బుచ్చయ్య, కాడె శంకర్, శ్రీనివాస్, కట్ల శంకర్ పలువురు పాల్గొన్నారు.



గడపగడపకూ కాంగ్రెస్‌లో మేడిపల్లి సత్యం

సమస్యలు పరిష్కరించాలి



హుజూరాబాద్: ఎస్సీ ఉపకులాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సిరిపాటి వేణు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో మాట్లాడారు. మండలానికో కమ్యూనిటీ హాల్ కేటాయించాలని, స్థానిక ఎన్నికల్లో 40 శాతం రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాబోయే రోజుల్లో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఉపకులాల హక్కుల పోరాట సమితి నాయకులు సమ్మయ్య, లింగయ్య, కొమురయ్య, సతీష్, రాజేశం, మల్లేశ్, వెంకట్, రాజు, కుమార్, సుధాకర్ , సాంబయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

సాగు చేయకున్నా.. పంట చేతికొచ్చే



మానకొండూర్: ఆరుగాలం కష్టపడితే గానీ ఏ పంటా చేతి కందదు. పొలం దున్నకుండా, నారు పోయకుండా, నాటు వేయకుండా వరి గొలకదశకు రావడంతో రైతులు, అధికారులు ఆశ్చర్యపోతున్నారు. మండలంలోని ఈదులగట్టెపల్లిలో దాసరి కిషన్‌రెడ్డి రబీలో వరిసాగు చేశాడు. నేషనల్ హైవే కింద భూమి కోల్పోవడంతో వానాకాలం సాగు చేయలేదు. హార్వెస్టర్‌తో వరి కోస్తున్న సమయంలో గింజలు పొలంలో రాలాయి. నేలరాలిన ధాన్యం గింజలు వర్షాకాలంలో మొలకెత్తాయి. సమృద్ధిగా కురిసిన వానలకు వరి గొలక దశకు చేరుకుంది.

ఉద్యోగాలు సాధించిన యువకులకు అభినందనలు



జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యనభ్యసించిన ఇల్లందకుంట మండలం సిరిసేడుకు చెందిన జలందర్, ఇల్లందకుంటకు చెందిన సందీప్, వీణవంక మండలం బేతిగల్‌కు చెందిన తడిగొప్పుల సోనీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ శ్రీలత, ఈశ్వరయ్య, స్వరూప, రాణి, రవీందర్, సుధాకర్, ప్రశాంత్, సాయిలు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995-96 పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. మృతిచెందిన ప్రధానోపాధ్యాయుడు దాసరి నరసింహారెడ్డి, అటెండర్ శేషమ్మ, విద్యార్థులు చల్ల వెంకన్న, కుక్కల శంకర్‌కు సంతాపంగా మూడు నిమిషాలు మౌనం పాటించారు. విశ్రాంత ఎంఈవో వీరగోని పెంటయ్య, ముగ్దంపూర్ జడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం బి. పద్మ, రిటైర్డ్ హెచ్‌ఎం వేణుమాధవ్, ఉపాధ్యాయులు జి.మాలతి, ఆండాళ్, సుహాసిని, సంపత్, మునయ్య, పీఈటీ ఎడవల్లి రాజిరెడ్డి, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆహ్వాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డీబీఎం 11 ఉపకాల్వకు గండి



శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో డీబీఎం 11 ఉపకాల్వకు సోమవారం గండి పడింది. దీంతో వరిపొలాల్లోకి నీరు వృథాగాపోతోంది. నీటిని ఆపివేసి గండిని పూడ్చాలని రైతులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ఉత్తమ సామాజిక సేవా స్ఫూర్తి అవార్డు



అవార్డు అందజేసి సన్మానిస్తున్న నిర్వాహకులు

రామడుగు: మండలంలోని కొక్కెరకుంట గ్రామానికి చెందిన గజ్జెల అశోక్‌కు కరీంనగర్ జిల్లా ఫిలింభవన్‌లో సద్భావన ఫోరం 5వ వార్షికోత్సవం పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలను అందించడంతో ఆత్మీయ సద్భావన స్ఫూర్తి అవార్డును సద్భావన ఫోరం గౌరవాధ్యక్షుడు దిండిగాల మహేష్, అధ్యక్షుడు కిరణ్‌కుమార్ అందజేశారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ...ఎనిమిదేళ్లుగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అవార్డు మరింత స్ఫూర్తిని నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.